### బియ్యం ఇయ్యాలే..



రేషన్‌కార్డు ఇస్తున్నట్లు పత్రాలు ఇచ్చారు. బియ్యం ఇవ్వడం లేదు. అలాంటప్పుడు రేషన్‌కార్డులు ఇచ్చి ఏం లాభం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్తగా పత్రాలు ఇచ్చిన వారందరికీ బియ్యం ఇచ్చేలా చూడాలి. రోడ్డు సౌకర్యం లేక మా గూడెం వాసులందరం ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో బయటికి వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తుంది. పైలెట్ గ్రామం చేసిన మా ఊరుకు రోడ్డు సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది.

**- శాంత, కోలాంగూడ, కొత్తపేట.**



కోటపల్లి మండలం బొప్పారంలో అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్డు

నమస్తే విజిట్ NAMASTE VISIT

# సమస్యల సుడిలో పైలెట్ పల్లెలు

## మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసినా ఫలితం శూన్యం

- ఎండిపోతున్న పల్లె ప్రకృతి వనాలు.. లోపించిన పారిశుధ్య నిర్వహణ..
- అధ్వాన్నంగా అంతర్గత రహదారులు.. దుర్వాసన వెదజల్లుతున్న డ్రెయినేజీలు..
- మూలనపడ్డ ట్రాక్టర్లు.. ఉపయోగంలో లేని సెగ్రిగేషన్ షెడ్లు..
- నిరుపయోగంగా డంపింగ్ యార్డు, శ్మశాన వాటికలు
- వేసవి దృష్ట్యా బోరు బావులు ఏర్పాటు చేయాలని వేడుకోలు
- అనర్హులను ఎంపిక చేశారంటూ అర్హుల కాంగ్రెస్ సర్కారుపై మండిపాటు
- ఇప్పటికైనా సౌకర్యాలపై సర్కార్ దృష్టి పెట్టాలని కోరుతున్న జనం
- పైలెట్ పల్లెల్లో 'నమస్తే తెలంగాణ' విజిట్



మంచిర్యాల జిల్లా ర్యాలీ గ్రామంలోని పల్లె ప్రకృతివనంలో ఎండిపోతున్న మొక్కలు

మంచిర్యాల, మార్చి 10(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒక గ్రామం చొప్పున పైలెట్ గ్రామాలను ఎంపిక చేసి వంద శాతం పథకాలను అమలు చేస్తామని కాంగ్రెస్ సర్కారు ప్రకటించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభావిత, లబ్ధిదారులు తక్కువ సంఖ్యలో ఉండే చిన్న గ్రామాలను ఎంపిక చేసి పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పుకుంటుంది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా సర్కారు ఎంపిక చేసిన పైలెట్ గ్రామాలు సమస్యల విలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అమలు చేయాల్సిన పథకాలు ఏమో గానీ కనీస సదుపాయాలు కల్పించకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు పెదవి విరుస్తున్నారు. కొన్ని పైలెట్ గ్రామాల్లో అంతర్గత రోడ్లు, రాకపోకలు సాగించేందుకు సరైన రహదారులు లేవు. ఇక గతంలో కేసీఆర్ సర్కారు ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో చెట్లు పూర్తిగా ఎండిపోయాయి. వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గ్రామ పంచాయతీలకు ఇచ్చిన ట్రాక్టర్లు నడిపే పరిస్థితి లేక పలు గ్రామాల్లో మూలన పడ్డాయి. చెత్త సెగ్రిగేషన్ షెడ్లు ఉపయోగంలో లేవు. పారిశుధ్య నిర్వహణ అసలే లేక అధ్వానపు పరిస్థితులు నెలకున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సోమవారం 'నమస్తే తెలంగాణ' విజిట్‌లో దాదాపు అన్ని పైలెట్ గ్రామాల్లో ఇలాంటి పరిస్థితులే కనిపించాయి.



కోటపల్లి మండలం బొప్పారంలో డంపింగ్ యార్డు పరిస్థితి



భీమారం మండలం దాన్నూర్‌లోని పల్లె ప్రకృతివనంలో ఎండిపోయిన మొక్కలు



కోటపల్లి మండలం బొప్పారంలో గ్రామ పంచాయతీ ట్రాక్టర్ పని చేయకపోవడంతో మూలన పడిన ట్రాలీ

### శత శాతం.. అగమ్య గోచరం..

రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన మేరకు రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ పైలెట్ గ్రామాల్లో 100 శాతం అమలు కావాలి. చాలా గ్రామాల్లో ఎంత మందికి వచ్చిందనే వివరాలు అధికారులు చెప్పలేకపోతున్నారు. మరోవైపు అర్హులైన వారిని కాదని తమకు కావాల్సిన వారినే ఎంపిక చేశారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. కాసిపేట మండలంలో పైలెట్ గ్రామమైన బుగ్గగూడెంలో ట్రాలీ ఉందని చెప్పి ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపిక చేయలేదని ఓ మహిళ వాపోయారు. డ్వాక్రా ఋణం తీసుకుని ట్రాలీ నడుపుకుంటూ గూన ఇంట్లో ఉండే తాము ఇంటికి ఎలా అర్హులమయ్యాయో, పక్కా ఇల్లు, ట్రాలీ ఉన్నవారు ఇందిరమ్మ ఇంటికి ఎలా ఎంపికయ్యారో చెప్పాలంటూ సదరు మహిళ వాపోయింది. కోటపల్లి మండలంలోని బొప్పారం గ్రామంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. గ్రామంలో అంతర్గత రోడ్లు నిర్మాణం లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ రిపేర్ వచ్చి మూలకు పడిపోగా ఆ ట్రాక్టర్ రిపేర్ షెడ్డుకు చేరి సంవత్సరాలు దాటుతున్న పట్టించుకునేవారు లేకుండా పోయారు. దీంతో ఆ ట్రాక్టర్ ఎందుకు పనికి రాకుండా పోయే ప్రమాదం ఉంది. గ్రామ పంచాయతీ ట్రాలీ కూడా రోడ్డు పక్కన పడిపోయి నిరుపయోగంగా మారింది. డంపింగ్ యార్డు కొన్ని నెలలుగా వినియోగంలో లేక బీటలు వారి శిథిలావస్థకు చేరింది. జన్నారం మండలంలో కొత్తపేట గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్లు కూడా లేవు. రేషన్ కార్డులకు ఎంపిక చేసిన వారికి ఇప్పటిదాకా బియ్యం సరఫరా చేయలేదని లబ్ధిదారులు చెప్తున్నారు. గ్రామంలోని డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక నిరుపయోగంగా మారాయి. వేసవి నేపథ్యంలో గ్రామంలో తాగునీటికి ఇబ్బంది అవుతుందని, ఇప్పుడున్న బోరుకు అదనంగా మరో బోరు వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇలా పైలెట్ గ్రామాలనే కాకుండా దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది.

### గూన పెంకుల ఇంట్లో ఉంటున్నా.. ఎంపిక చేయలేదు..

మా ఊరును పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. ఇందిరమ్మ ఇండ్లు కావాలని మేము దరఖాస్తు చేసుకున్నాం. నేను గూన పెంకుల ఇంట్లో ఉంటున్న మాకు ట్రాలీ ఉందని ఇందిరమ్మ ఇంటికి ఎంపిక చేయలేదు. ఆ ట్రాలీ కూడా డ్వాక్రా రుణం తీసుకుని కొనుకున్నా. అలాంటప్పుడు మేము ఎలా అనర్హులం అవుతాం. మా ఇంటిని మీరే చూడండి. మాకు ఇల్లు ఇవ్వకుండా పక్కా ఇండ్లు, సొంత ట్రాలీలు ఉన్నోళ్లను ఎంపిక చేశారు. లబ్ధిదారుల ఎంపిక సరిగా జరగలేదు. మాలాంటి వారికి న్యాయం చేయాలి.

**- భీమిని రాజేశ్వరి, బుగ్గగూడెం.**



# గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని మృతి

ఇచ్చోడ/బోథ్, మార్చి 10 : ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని చిక్రం లాలిత్య(13) మృతి చెందింది. ఎస్సై తిరుపతి, హెచ్‌ఎం ఉత్తం వివరాల ప్రకారం.. బజార్‌హత్నూర్ మండలంలోని మొర్కండి గ్రామానికి చెందిన చిక్రం రాజేశ్వర్-లక్ష్మి దపంతుల కుమార్తె లాలిత్య ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది. ఆదివారం తోటి విద్యార్థులతో కలిసి రాత్రి 11 గంటల వరకు చదువుకుని నిద్రించింది. ఉదయం లేవక పోవడంతోపాటు నోటి నుంచి నురుగు రావడంతో పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం అందించారు. హుటాహుటిన హాస్టల్ వచ్చి చూడగా అప్పటికే బాలిక మృతి చెందింది. విద్యార్థిని తల్లిదండ్రులు ఫిడ్స్ లేదా ఇతర కారణాలతో మృతిచెంది ఉండొచ్చని ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

#### విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలి

లాలిత్య కుటుంబానికి న్యాయం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) నాయకులు బోథ్ సీహెచ్‌సీలోని శవాగారం ఎదుట ధర్నా చేపట్టారు. కుటుంబీకులతో కలిసి బైఠాయించారు. ఆశ్రమ పాఠశాల నిర్వాహకుల మూలంగానే విద్యార్థిని మృతి చెందిందని ఆరోపించారు. కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతోపాటు కుటుంబీకులు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ ఏపీవో జనరల్ వసంత్‌రావ్ అక్కడికి చేరుకుని నాయకులు, కుటుంబీలతో మాట్లాడారు. విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటామని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



చిక్రం లాలిత్య(ఫైల్)

#### పట్టింపు లేని ప్రభుత్వం : ఎమ్మెల్యే

ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చనిపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండిపడ్డారు. సోమవారం బోథ్‌లోని సీహెచ్‌సీలో విద్యార్థి చిక్రం లాలిత్య కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇచ్చోడలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని చిక్రం లాలిత్య అనుమాస్పద స్థితిలో మృతి చెందిందన్నారు. ఆదివాసీ, గిరిజన బిడ్డలు పిట్టల రాలిపోతున్న ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందన్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక పిల్లలు అవస్థలు పడుతున్నారన్నారు. భోజనం సరిగ్గా పెట్టడం లేదని ఆరోపించారు. కుటుంబానికి న్యాయం చేసే వరకు ఊరుకునేది లేదన్నారు. రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కుటుంబీకులకు ఐటీడీఏలో ఉద్యోగం కల్పించాలన్నారు. పరామర్శించిన వారిలో బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, డాక్టర్ సజన్, సురేందర్ యాదవ్, డాక్టర్ స్వామి, లింగారెడ్డి ఉన్నారు.

#### శ్వాసకోస ఇబ్బందితో మృతి

ఇచ్చోడ ఆశ్రమ పాఠశాల బాలిక శ్వాసకోస ఇబ్బందితో మృతి చెంది ఉంటుందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోజు మాదిరిగానే విద్యార్థిని ఆదివారం కూడా అందరితో కలిసి భోజనం చేయడంతోపాటు రోజు వారి కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. రాత్రి 40 మంది విద్యార్థినులతో కలిసి పడుకుందన్నారు. అందులో ఏఎన్‌ఎం కూడా నిద్రించిందని, ఉదయం లేవకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. ఇటీవల నిర్వహించిన హెల్త్ క్యాంప్‌లో 10 శాతం హిమోగ్లోబిన్ ఉందన్నారు. విద్యార్థిని శ్వాసకోస ఇబ్బందితో మరణించి ఉంటుందని అధికారులు నిర్ధారించారన్నారు. పోస్ట్‌మార్టం రిపోర్ట్ తర్వాత పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.



పోస్టుమార్టం గది ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు



విద్యార్థిని తండ్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### కాంగ్రెస్ తెచ్చిన కరువు

# ఆగుతూ.. సాగుతూ..

## లో ఓల్టేజీతో నెమ్మదిగా నీటిని పోస్తున్న బోర్లు

- కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు..
- ఇప్పటికే మూడుసార్లు ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు
- నీటి తడులు అందక 'ఎండు'తున్న పంటలు
- సర్కారు నాణ్యమైన కరెంటు ఇచ్చి ఆదుకోవాలి

సారంగాపూర్, మార్చి 10 : లో ఓల్టేజీ సమస్య కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయి. ఒకవైపు లో ఓల్టేజీ, మరోవైపు ఎండలు ముదురుతుండడంతో పంటలు వట్టిపోతున్నాయి. సారంగాపూర్ మండలం జామ్ గ్రామంలో మజీద్ వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ లో ఓల్టేజీతో ఫిబ్రవరి 26వ తేదీన కాలిపోయింది. దీంతో రైతులు విద్యుత్ అధికారులకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేయాలని మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. దీంతో వరంగల్ విద్యుత్ టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సంప్రదిస్తే ఐదు రోజుల క్రితంట్రాన్స్‌ఫార్మర్‌ను నిర్మల్ విద్యుత్ కార్యాలయానికి తీసుకెళ్లి బాగు చేయించి బిగించారు. బిగించిన ట్రాన్స్‌ఫార్మర్ మళ్లీ చెడిపోయింది. మళ్లీ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. లో ఓల్టేజీ కరెంట్ సమస్య మూలంగా కొందరి రైతుల మోటార్లు కాలిపోయాయి. దీనికితోడు ఎండలు ముదిరుతుండడంతో 12 రోజుల నుంచి సాగు నీరు అందక సుమారు 40 ఎకరాల వరి పైరు ఎండిపోయి భూమి నెర్రలు వారింది. మూడు నుంచి నాలుగు రోజులు నిరంతరంగా కరెంట్ ఉంటేనే పొలాలకు తడులు అందుతాయని రైతులు పేర్కొంటున్నారు. లేదంటే పొలంలో పశువులను వదలాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఓవోల్టేజీ సమస్యతో కాలిపోయిన మోటార్‌ను బయటకు తీస్తున్న రైతులు



### రూ.50 వేలు నష్టం

ఒకే బోరు కింద ఎకరం సొంత, మూడెకరాలు కౌలుకు తీసుకుని వరి వేశా. ట్రాన్స్‌ఫార్మర్ చేడిపోవడం, లో ఓల్టేజీ సమస్య కారణంగా 12 రోజుల నుంచి నీరు అందకపోవడంతో నాలుగెకరాలు ఎండిపోయింది. విద్యుత్ అధికారుల మూలంగానే తన పొలం పోయిందని, ఎన్నిసార్లు ట్రాన్స్‌ఫార్మర్ గురించాలని చెప్పినా పట్టించుకోలేదు. పంటకు కేజీవిల్, నాటు, అడుగు మందు కోసం రూ.50 వేలు అప్పు చేసి సాగు చేశా. చిల్లిగవ్వకూడా వస్తుందో లేదో తెలియని పరిస్థితి ఉంది. పొలంపై ఆశలు వదులుకున్నా.

**- మకాంళి లోకదాస్, రైతు, జామ్.**

# నూతన పద్ధతులతో చేరువ చేసేందుకు కృషి

ఎదులాపురం, మార్చి 10 : నూతన పద్ధతులతో పోలీసులను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తానని ఆదిలాబాద్ నూతన ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లాకు నూతనంగా విచ్చేసిన ఎస్పీ అఖిల్ మహాజన్ బాధ్యతలు స్వీకరించారు. మొదటగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి, ప్రస్తుత కరీంనగర్ సీపీ గౌష్ ఆలం వద్ద నుంచి ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా కట్టడి చేస్తానని తెలిపారు. అదేవిధంగా నేరాలను నియంత్రించడం, శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన ధ్యేయం అని తెలిపారు. గంజాయి, మాదక ద్రవ్యాలపై దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్య, సంఘ విద్రోహ శక్తుల సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తామని తెలిపారు. ప్రజలు, పోలీసులు, మీడియా మిత్రులు అందరూ కలిసికట్టుగా జిల్లా ఉన్నతికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేంద్రరావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, నాగేందర్, హసీబుల్లా ఎస్పీకి స్వాగతం పలికారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న అఖిల్ మహాజన్

# గ్రూప్-1కు ఇద్దరు క్వాలిఫై

## ఫలితాలను ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ

తాంసి, మార్చి 10 : ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అభ్యర్థులు గ్రూప్-1 ఫలితాల్లో అర్హత సాధించారు. టీఎస్‌పీఎస్సీ సోమవారం గ్రూప్-1 ఫలితాలను విడుదల చేసింది. ఈ ఫలితాల్లో తాంసి మండలంలోని బండల్‌నాగపూర్‌కు చెందిన సురకుంటి సచిన్‌రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 454.5 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఈయన తాంసి మండల మాజీ ఎంపీపీ సురకుంటి మంజుల-శ్రీధర్‌రెడ్డి దంపతుల కుమారుడు. హైదరాబాద్‌లో ఇంటర్, మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో బీటెక్ పూర్తి చేశారు. సివిల్స్‌కు ఢిల్లీలో ప్రిపేర్ అయ్యాడు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ముందుకు సాగిన ఆయన ఇప్పటికే గ్రూప్-4లో ప్రతిభ కనబరిచి మున్సిపల్ వార్డు ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాజాగా వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో విజయాన్ని సాధించడంపై గ్రామస్తులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

#### రైతుబిడ్డకు..

భీంపూర్ మండల సరిహద్దు గ్రామమైన కరంజి(టీ)కి చెందిన వ్యవసాయ కుటుంబానికి చెందిన కార్తీక్ రెడ్డి గ్రూప్-1లో 442.5 మార్కులు సాధించాడు. తల్లిదండ్రులు రాధ- సుదర్శన్‌రెడ్డిలకు కార్తీక్‌తోపాటు పెండ్లి అయి సోదరుడు, సోదరి ఉన్నారు. కార్తీక్ ప్రాథమిక విద్యాభ్యాసం పిప్పర్‌వాడ ఆదిలాబాద్ సీఆర్‌ఆర్ పాఠశాల, డిగ్రీ, పీజీ హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో పూర్తి చేశాడు. తర్వాత గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. కార్తీక్‌ను, ఆయన కుటుంబాన్ని గ్రామస్తులు అభినందించారు.



సురకుంటి సచిన్‌రెడ్డి



ఎల్టి కార్తీక్ రెడ్డి